క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



కోస్గి: ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా సమాజంలో గుర్తింపుతోపాటు పుణ్య ఫలం దక్కుతుందని సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఉచితంగా తాగునీరు అందించే చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా పలువురు హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల కోసం ఉచిత చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు ప్రయాణికులు సమితి సభ్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ విష్ణు ప్రసాద్, ప్రతినిధులు మల్లికార్జున్, అంజిలయ్య, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి జయంతి

నారాయణపేట రూరల్ : పట్టణంలోని రెండు అయ్యప్పస్వామి ఆలయాల్లో ఆదివారం స్వామివారి జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. వల్లపల్లిరోడ్‌లోని శబరిపీఠం, యాద్గీర్‌రోడ్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేసి మధ్యాహ్నం అన్నదానం చేస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

ధాన్యం కొనుగోలు చేపట్టాలి

దామరగిద్ద: రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలును చేపట్టాలని పిడెంపల్లి గ్రామ రైతు వీరారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను కేటాయించిందన్నారు. కేంద్రాలున్న కొనుగోలు మాత్రం చేపట్టడం లేదన్నారు. ఇప్పటికే అకాల వర్షాలతో చేతికందిన పంటలు నష్టపోతున్నామని, నూర్పిడి చేసిన ధాన్యం నిల్వలకు కోడౌనులు లేవన్నారు. రైస్ మిల్లులు ఎంపిక చేయలేదని అధికారులు ఆలస్యం చేయడం సరికాదన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

భక్తులకు అన్నదానం



మక్తల్: పట్టణంలోని వీరభద్ర ఆలయంలో ఉదయం అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించి అగ్నిలో నడుచుకుంటూ భక్తులు వెళ్లారు. అనంతరం సాయంత్రం రథోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవాలు సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోస్గి: మున్సిపల్ పరిధిలోని గుండ్లపల్లి శివారులో పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడిచేసి పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాలిలా.. పోతిరెడ్డిపల్లిలో గతకొంత కాలంగా పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో శుక్రవారం సిబ్బందితో కలిసి ఆకస్మికదాడి చేయగా గుండ్లపల్లి శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, పేకాట స్థలంలో రూ. 2170నగదు సైతం దొరికిందన్నారు. పట్టుబడిన వారిపై కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఈ నెల 18న రౌండ్‌టేబుల్ సమావేశం



నర్వ: ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగబోయే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు చక్రవర్తి ఒక ప్రకటనలో కోరారు. శనివారం జంగంరెడ్డిపల్లి, పాథర్చేడ్ గ్రామాల్లో కరపత్రాల ప్రచార క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులపై పెట్టినటువంటి అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, కాలుష్యం వెదజల్లుతున్న చిత్తనూర్ కంపెనీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోవిందు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాలు 14 నుంచి 20వరకు నిర్వహిస్తున్నామని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం సీఐ కార్యాలయంలో సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ సమక్షంలో వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ప్రతిరోజు ఆత్మకూర్‌లోని బస్టాండ్, తదితర ప్రాంతాల్లో అవగాహన నిర్వహించనున్నట్లు వివరించారు.

ఇన్‌చార్జిల పాలన ఇంకెన్నాళ్లు?

- రెగ్యులర్ అధికారులకు నోచుకోని మాగనూర్
- అభివృద్ధిలో వెనకబాటుకు గురవుతున్న వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



మాగనూర్‌లో ఇలా..



కొత్తపల్లి లోపించిన పారిశుద్ధ్యం

మాగనూర్: జిల్లాలో మారుమూలన ఉన్న మాగనూర్ మండలం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ముఖ్య శాఖలు ఏళ్లుగా ఇన్‌చార్జిల పాలనలోనే కొనసాగుతున్నాయి. ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న అధికారులపై ఇతర మండలాల బాధ్యతలు ఉండటంతో మండలానికి ఎప్పుడు వచ్చి వెళ్తున్నారో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారలు స్పందించి మండలంలో ఇన్‌చార్జిల పాలనకు ముగింపు పలికి రెగ్యులర్ అధికారులను నియమించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులు ఇవే..

ఎంపీడీఓ, వ్యవసాయ శాఖలో ఏఓ, ఎంఈఓ, ఈజీఎస్ ఏపీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో పంచాయతీ అభివృద్ధిలో కీలక పోస్టులు ఖాళీగా ఉంది. అంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహించిన కొందరిని ఇతర మండలాలతోపాటు కలెక్టర్ కార్యాలయాలకు డిప్యూటేషన్, బదిలీలు చేశారు. మండలంలోని ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న శశికళ ఈ మధ్య పదవీ విరమణ చేశారు. దీంతో ఎంపీఓ జైపాల్‌రెడ్డికి రెండు బాధ్యతలు అప్పగించడంతో తలకుమించిన భారమవుతుంది.

ఇన్‌చార్జి ఏఓ..

వ్యవసాయాధికారిగా హరిత విధులు నిర్వహిస్తుండగా ఆమె కొన్ని నెలల క్రితం సెలవులపై వెళ్లారు. దీంతో కృష్ణామండలం ఏఓ సుదర్శన్‌గౌడ్‌కు రెండు మండలాలకు సంబంధించి బాధ్యతలు ఇవ్వడంతో ఒకరోజు ఇక్కడ, మరో రోజు అక్కడ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విద్యా శాఖలోనూ అంతే..

ప్రస్తుత మాగనూర్ మండల ఇన్‌చార్జి ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటయ్య ఏకంగా ఐదు మండలాల బాధ్యతలు చూస్తున్నారు. కొన్ని నెలల క్రితం ఎంఈఓ లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ పొందడంతో ఈయనకు మాగనూర్ మండలానికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో వారానికి ఒక్కో మండలానికి ఒకసారి విజిట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వైద్యాధికారి సైతం

మండలంలో 24 గంటల ఆరోగ్య సేవలు ఉండటంతో ఇక్కడ ఇద్దరు వైద్యాధికారులు అవసరం ఉంది. అయితే ఇక్కడ ఒక్కరు కూడా రెగ్యులర్ వైద్యులు లేరు. ఉన్న ఒక్కరూ కాంట్రాక్ట్ బేసిక్ కావడంతో వైద్యసేవల కోసం మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లేక పారిశుద్ధ్యం లోపించింది. పంచాయతీలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా ఉన్నాయి.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



మండలంలో ఎన్నో రోజులుగా ముఖ్యశాఖల అధికారుల బాధ్యతలు ఇన్‌చార్జిలకు ఇవ్వడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తిస్థాయి అధికారులను నియమించాలి.

– అంజనేయులు, సీఐటీయూ జిల్లా కోశాధికారి

అవగాహన కరువైంది..



మండల కేంద్రంలో వ్యవసాయశాఖ అధికారి లేక ఇబ్బంది పడుతున్నాం. పంటలు దెబ్బతింటే చెప్పుకుందామని కార్యాలయానికి పోదామంటే దూరమవుతుంది. ఇప్పటికైనా మండల వ్యవసాయ అధికారిని నియమించాలని కోరుతున్నాం.

– పల్లె మారెప్ప, బీఆర్‌ఎస్ నాయకుడు

ఉన్నతాధికారుల దృష్టికి..



అన్ని శాఖలలో ఇన్‌చార్జి పాలన కొనసాగడం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయి అధికారులను నియమించేలా ప్రయత్నం చేస్తాం. మాగనూర్ మండల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటాం.

– శ్యామలమ్మ, ఎంపీపీ, మాగనూర్

'కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత మొదలైంది'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: మూడు నెలల కాలంలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైయిందని, ఇప్పటికే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గుర్తు చేశారు. శనివారం కొత్తపల్లి, మద్దూరు మండలాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్త సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ మధ్యనే పోటీ ఉందని, కాంగ్రెస్ మూడోస్థానానికి పరిమితమవుతుందని సర్వే చెబుతున్నాయన్నారు. కష్టపడి పనిచేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందు కోసం ఈ నెల 15న నియోజకవర్గానికి బీఆర్‌ఎస్ నేత హరీష్‌రావు వస్తున్నారని ఈ సభకు గ్రామం నుంచి వందమందికి తగ్గకుండా రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వీరారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, గోపాల్, ఉసేనప్ప, మదుసుధన్‌రెడ్డి, నర్సింహా, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మరికల్: బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లో ఉచిత బస్సు సౌకర్యం తప్ప ప్రజలకు చేసింది ఏమిలేదని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందన్నారు. తెలంగాణ సాధించిన బీఆర్‌ఎస్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, తిరుపతయ్య, బసంత్, రామస్వామి, రాములు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో గుంతలు పూడ్చివేత



మరికల్: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఏర్పడిన గుంతలను పూడ్చివేసేందుకు శనివారం ఆర్టీసీ అధికారులు మట్టివేసి మరమ్మతులు పనులు చేపట్టారు. గతయేడాది నుంచి బస్టాండ్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడిన విషయంపై డ్రైవర్లు పలుమార్లు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆర్టీసీ అధికారులు ఎట్టకేలకు మట్టివేసి మరమ్మతులు చేయించారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్



మద్దూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైనా రెనివట్ల, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఫ్లాగ్‌మార్చ్ శనివారం నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికే ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు. ప్రజలకు ఎన్నికలపై అభద్రతభావం లేకుండా భరోసా కల్పిస్తామని ఆయన తెలిపారు.

ఉమ్రా యాత్రికులకు ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: మక్కా, మదీనా ఉమ్రా యాత్రకు వెళ్తున్న మహ్మద్ రఫీ, మహ్మద్ జహంగీర్‌లను శనివారం అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ జహంగీర్‌బాబా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మౌలానా మహ్మద్ ముబారక్ యాత్రికులు క్షేమంగా వెళ్లి రావాలని, వారి ఉమ్రా యాత్ర ఖుబూల్ కావాలని, దేశం, రాష్ట్ర అభివృద్ధి కోసం దువా చేశారు. అబ్దుల్ ఖాదర్ జిలాని, ఖాజా అలీబేగ్, మహ్మద్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాగనూర్: మండల పరిధిలోని పెగడబండ మండల ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా శ్రీముఖి, డీఈఓగా రమ్య, ఎంఈఓగా తరుణ్, సర్పంచ్‌గా శ్రీహరితోపాటు మరో పది మంది విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నరేందర్ తోటి విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యావలంటరీ మహదేవ్, పాఠశాల సిబ్బంది నారాయణరెడ్డి, సారా, విద్యార్థులతల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డికి ఘన నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని స్థానిక గ్రౌండ్ స్కూల్‌లో శనివారం జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పీడీఎస్‌యూ నాయకులు నివాళులర్పించి మాట్లాడారు. జార్జిరెడ్డి ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేద్దామన్నారు. ఆయన సాగించిన విప్లవ పోరాటాలు తెలుగు నేలపై కొత్త అధ్యాయాన్ని రచించాయని, ఆధిపత్య వ్యవస్థలపై ఎదురునిలిచి పోరాడి ప్రాణాలు విడిచారని గుర్తుచేశారు. నేటి యువత, విద్యార్థిలోకానికి ఆదర్శమని, ఆయన జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ చదువుకుని పాటించాలన్నారు. గౌస్, వెంకటేష్, నవీన్, కృష్ణ, అశోక్, అక్షయ్, కావేరి, అమూల్య, అర్చన, విద్యార్థులు పాల్గొన్నారు. –అదేవిధంగా బీసీకాలనీలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కాంగ్రెస్‌లో చేరిక..



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

నారాయణపేట: ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి సమక్షంలో శనివారం సీవీఆర్ భవన్‌లో పేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్‌తోపాటు కౌన్సిలర్ సరిత సతీష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు వినోద్, మారుతి, యువనాయకులు పోలేపల్లి అరుణ్, గొల్ల రవి బీఆర్‌ఎస్, బీజేపీలను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా మండలంలోని సింగారం గ్రామ తాజా మాజీ సర్పంచ్ కొంకల్ జయంతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సిద్రమయ్యతో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ గెలుపునకు కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు వారికి హామీచ్చారు.

అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట రూరల్ : అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అందుకు తగినట్లు ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషిచేయాలని డీఎస్పీ లింగయ్య అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఫైర్ అధికారులతో కలిసి అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 20వరకు జరిగే వారోత్సవాల కార్యక్రమంలో అవగాహన కల్పించడం, కరపత్రాలు ముద్రించి ప్రజలకు పంచడం చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, గోదాంలు, సామిల్స్, సినిమా థియేటర్లు, మాల్స్, ఇతర రద్దీ ప్రదేశాల్లో పర్యటించి ప్రాక్టికల్‌గా ప్రమాదాల నివారణ చర్యలు వివరించాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తెలియజే యాలన్నారు. వాహనాలను ఎప్పుడు నీళ్లతో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రమాద సమయంలో వేగంగా సంఘటన స్థలానికి చేరుకుని ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించాలన్నారు. అత్యవసర సమయంలో 101టోల్‌ఫ్రీ నెంబర్‌తో పాటు స్థానిక కార్యాలయంలోని 08506-282401 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఓ మలికర్జున్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

జల సంరక్షణ మనందరి ప్రాథమిక కర్తవ్యం



అవగాహనలో మాట్లాడుతున్న అధికారులు

కోస్గి: నీటిని వృథా చేయకుండా అవసరమైనంత వరకు వినియోగించుకోవాలని, జలసంరక్షణ మనందరి ప్రాథమిక కర్తవ్యమని ఏఎంఓ విద్యాసాగర్ అన్నారు. ఈ మేరకు శనివారం వాక్ ఫర్ వాటర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులతో జల సంరక్షణ నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక శివాజీ చౌరస్తాలో విద్యార్థులతో మానవ హారం నిర్వహించి నీటి సంరక్షణ అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏఎంఓ మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్ తరాలకు జ్ఞానం అందించే వారధి వంటి వారని, నీటి లభ్యత, ప్రాముఖ్యత, సంరక్షణ విధానం తెలుసుకొని చుట్టు పక్కల వారికి వివరించాలన్నారు. నీటి సంరక్షణపై అవగాహన లేకపోవడంతో నేడు బెంగళూర్ వంటి ప్రాంతాలు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదురుకుంటున్నాయన్నారు. ఈ సందర్భంగా పలువురు సైన్స్ ఉపాధ్యాయులు ప్రతిరోజు వాడే నీటిని ఏ విధంగా సంరక్షించుకోవాలి, భూగర్భ జలం పెంపొందించే విధానం, ఇంకుడు గుంతల ప్రాముఖ్యత తోపాటు పలు అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులు నీటి భద్రత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, వాక్ ఫర్ వాటర్ స్వచ్ఛంద సంస్థ వాలీంటర్ వీరు మల్లేష్, మండల నోడల్ అధికారి శంకర్‌నాయక్, హెచ్‌ఎంలు రామకృష్ణారెడ్డి, కృష్ణగౌడ్, సీఆర్పీలు దస్తయ్య, పద్మతోపాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత మానవ జీవితాలకు పరివర్తన వేదిక



భగవద్గీత పుస్తకాల పంపిణీలో పాల్గొన్న రామకృష్ణ సేవ సమితి సభ్యులు

నర్వ: భగవద్గీత మానవ జీవితాలకు ఓ పరివర్తన వేదిక అని ఉమ్మడి జిల్లా టీటీడీ కార్యనిర్వాహణ అధికారి ఉత్తారాపల్లి రామాచారి అన్నారు. శనివారం రామకృష్ణసేవాసమితి, ఇస్కాన్ సంస్థ సౌజన్యంతో భగవద్గీత పుస్తకాల పంపిణీ కార్యక్రమం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ మేరకు.. పలువురు వక్తలు భగవద్గీత యొక్క పాశస్త్యం, గీతతో మనం నేర్చుకోవాల్సింది ఏముంది అనే వివిధ అంశాలపై వివరించారు. ఆధ్యాత్మిక పరివర్తన నేటి యువతలో తీసుకొచ్చేందుకు కొంత ప్రయత్నమే ఈ భగవద్గీత పుస్తకాల పంపిణీ కార్యక్రమం అని అన్నారు. నిరంతరం గీత పఠనం చేపడితే మనలో ఒక గొప్ప మార్పు తథ్యమన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ సభ్యులు లంకాల్ రామకృష్ణస్వామి, ప్రణవానందస్వామి, రామకృష్ణసేవా సమితి జిల్లా కన్వీనర్ రాజమల్లేష్, టీటీడీ కార్యనిర్వహణ అధికారి ఉత్తారాపల్లి రామాచారి, సభ్యులు శ్రీరాములు, కృష్ణయ్య, బ్రహ్మయ్య చెన్నయ్య, సంజన్న, గంగాధర్, నర్వ రామకృష్ణ, వివేకానంద సేవాసమితి సభ్యులు నరేష్, వెంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు రాములు, కొండన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న పాఠశాల హెచ్‌ఎం స్వప్న

మాగనూర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం మండంలోని ఆయా గ్రామాల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఎనుకున్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదర్శ కమిటీని ఎన్నుకోగా గ్రామైక్య సంఘాల అధ్యక్షులను చైర్‌పర్సన్‌గా పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న పాఠశాల విద్యార్థి తల్లులకు కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. ప్రతి తరగతి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారీగా ముగ్గురు మహిళల చొప్పున కమిటీ ఏర్పాటుచేశారు. ఈ మేరకు.. చైర్‌పర్సన్‌గా వెంకటమ్మ, క్వీనర్‌గా స్వప్న, సభ్యురాలుగా రుక్మిణి, శారద, రాధా, అనిత, సునీత, స్వాతి, నర్సమ్మ, లక్ష్మి, మహాదేవమ్మా తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వప్న, ఉపాధ్యాయులు దీప, విశాలక్ష్మి, శశిరేఖ, సీఆర్‌పీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



మరికల్‌లో మద్యం పట్టుకున్న పోలీసులు



మాగనూర్‌లో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మరికల్: మండల కేంద్రంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. శనివారం ఎక్లాస్‌పూర్‌కు చెందిన బండారి బాలకృష్ణ నుంచి రూ. 12వేల విలువ చేసే 22 లీటర్ల లిక్కర్‌ను బైక్‌పై తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.

మాగనూర్: మండలంలోని మందిపల్లిలో బెల్టుషాపుపై స్థానిక హెడ్ కానిస్టేబుల్ అర్జున్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు చేసి 11.65 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు.. కానిస్టేబుల్ నిలయ్య తెలిపిన వివరాలిలా.. శుక్రవారం రాత్రి మండలంలోని మందిపల్లి గ్రామాల్లో బెల్టుషాపులపై దాడులు చేయగా అక్కడ ఎక్కువ మొత్తంలో అక్రమ మద్యం గుర్తించామని, బెల్టుషాపు యాజమానిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసునమోదు చేసినట్లు తెలిపారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దూరు: భారతదేశ రెండవ జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ బీపీ మండల్ వర్ధంతిని శనివారం మండల కేంద్రంలో బీసీ సంఘం నాయకులు పకీరప్ప, వెంకటయ్య, రాములు, వెంకటయ్య, కురుమయ్య, మల్లయ్య తదితరులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. దేశం మొత్తం పర్యటించి ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించిన గొప్ప నాయకుడు బీపీ మండల్ అని కొనియాడారు. ఆయన సూచించిన రిజర్వేషన్ల ప్రభుత్వం ఇప్పటి అమలు పర్చడం లేదన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.